క్లుప్తంగా

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



అండర్‌-17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో పాఠశాల హెచ్‌ఎం, తదితరులు

వేంపల్లె : క్రికెట్‌ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి నేతి కమల్‌నయన్‌ అండర్‌-17 రాష్ట్రస్థాయి క్రికెట్‌ పోటీలకు ఎంపికయ్యారని.. ఈనెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మచిలీపట్నంలో జరిగే అంతర్‌ జిల్లాల క్రికెట్‌ పోటీలలో విద్యార్థి కమల్‌నయన్‌ పాల్గొంటారన్నారు. విద్యార్థి ఎంపికపట్ల పాఠశాల హెచ్‌ఎంతోపాటు పీఈటీ ఫ్రాంచేస్‌, కమిటీ చైర్మన్‌ గురుప్రసాద్‌, రిటైర్డు హెచ్‌ఎం వెంకటేశం శ్రేష్టి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న గంగరాజు

వేంపల్లె : జిల్లా వ్యాప్తంగా ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన పార్మేటివ్‌ అసెస్‌మెంట్‌ పరీక్షా కేంద్రాలను గురువారం రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి అసెస్‌మెంట్‌ సెల్‌ సభ్యుడు గంగరాజు పరిశీలించారు. వేంపల్లె మండలం తాళ్లపల్లె ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్లాస్‌ రూం బేస్డ్‌ అసెస్‌మెంట్‌ పరీక్ష నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో లిప్‌ మానటరింగ్‌ ఆఫీసర్‌ శ్రీనివాస్‌, హెచ్‌ఎం దస్తగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న కౌన్సిలర్‌ శైలజ, తదితరులు

పులివెందుల టౌన్‌ : వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పట్టణంలోని జెండామాను వీధి, గుంతబజార్‌, ముత్యాలవారి వీధి, అమ్మవారిశాల తదితర ప్రాంతాలలో పట్టభద్రుల ఓటర్లను కలిసి స్థానిక కౌన్సిలర్‌ శైలజ కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఐటీఐ సాయి, యార్వ వెంకట సుబ్బయ్య, ఆలయ చైర్మన్‌ బ్యాటరీ ప్రసాద్‌, తదితరులు పాల్గొన్నారు.

రబీ ఈ-క్రాప్‌ను తనిఖీ చేసిన ఏడీఏ



రబీ పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ అశోక్‌రెడ్డి, ఏఓ రమేష్‌, తదితరులు

లింగాల : మండల పరిధిలోని పెద్దకుడాల రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏడీఏ అశోక్‌రెడ్డి రబీ ఈ-క్రాప్‌ నమోదుపై తనిఖీ నిర్వహించారు. రబీ సీజన్‌లో పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఆర్‌బీకేలోని ఎరువుల నిల్వలను పరిశీలించి రైతులకు అవసరమైన ఎరువులను నిల్వ ఉంచాలని ఆర్‌బీకే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ రమేష్‌, ఆర్‌బీకే ఇన్‌చార్జి చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్‌ సరఫరా వేళల్లో మార్పులు

లింగాల : మండలంలో అన్ని విద్యుత్‌ సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయ విద్యుత్‌ సరఫరా వేళల్లో మార్పులు ఉంటాయని ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ల పరిధిలో ఏ,బి గ్రూపులుగా ఫీడర్లను విభజించి విద్యుత్‌ సరఫరా చేస్తారన్నారు. ఏ గ్రూపు ఫీడర్లకు శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 9 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. బి గ్రూప్‌ ఫీడర్లకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 9 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. ప్రతి సోమవారం షిఫ్టుల వారీగా మార్పులు ఉంటాయన్నారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. వేసవికాలంలో పవర్‌ సబ్‌స్టేషన్లపై అధిక భారం పడకుండా ఉండేందుకు ఉన్నతాధికారుల సూచనల మేరకు షిఫ్టుల ప్రకారం విద్యుత్‌ సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

పేదల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మహాశివరాత్రి ఆహ్వాన గోడ పత్రాలను అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : పేదల ఆర్థిక బలోపేతమే జగనన్న లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్‌ రామాంజులురెడ్డిలు తెలిపారు. గురువారం మండలంలోని పెద్దకాంపల్లి, కొలుములపల్లి పంచాయతీ పరిధిలోని మద్దిమడుగు, సుగాలిబిడికి, లక్ష్మీనారాయణపురం, వేపమానుసత్రం గ్రామాల్లో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేస్తున్నారన్నారు. మన సంక్షేమ పథకాలను చూసి దేశంలోని ఇతర రాష్ట్రాలు ప్రవేశ పెట్టేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్‌ కళాయాదవ్‌, మాజీ కన్వీనర్‌ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కృష్ణయ్య, సర్పంచ్‌లు మల్లికార్జునయాదవ్‌, రాజశేఖర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, సుబ్బరాయుడు, ఎంపీటీసీలు నారే నాగరాజు, వెంకటరెడ్డి, నాయకులు రామాంజనేయులు, గూడ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, గజ్జల ఈశ్వర్‌రెడ్డి, చిన్న సిద్దయ్య, లక్కిరెడ్డి రమణారెడ్డి, కువైట్‌ బాషా పాల్గొన్నారు.

గోడ పత్రాల అవిష్కరణ

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలో ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన గోడ పత్రాలను గురువారం కడప నగరంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర సోషల్‌ వెల్ఫేర్‌ చైర్మన్‌ పులి సునీల్‌కుమార్‌లు అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ఈఓ మహేశ్వర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి, ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం



గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న సర్పంచ్‌ ఓబుళరెడ్డి, తదితరులు

తొండూరు : పోషకాహారం తీసుకోవడంతో గర్భిణులలో రక్తహీనత దూరమవుతుందని తొండూరు పీహెచ్‌సీ డాక్టర్‌ అరిపుల్లా తెలిపారు. తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రమాదకర గర్భిణులకు గర్భస్రావం, రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్‌ పరీక్షలు చేయడంతోపాటు రక్తహీనత కలిగిన వారికి ఐరన్‌ సుక్రోజ్‌ ఇవ్వడం జరిగిందన్నారు. రక్తహీనతను జయించడానికి పోషకాహారం తీసుకోవడంతోపాటు ఐరన్‌ మాత్రలు, కాల్షియం మాత్రలు వాడాలన్నారు. అనంతరం గర్భిణులకు సైదాపురం సర్పంచ్‌ ఓబుళరెడ్డి ఖర్జూరాలు, అరటి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ మల్లయ్య, సచివాలయ ఆరోగ్య అధికారిణులు, ల్యాబ్‌ టెక్నీషియన్‌ కుమారి, స్టాఫ్‌ నర్సులు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలో రికార్డుల తనిఖీ

లింగాల : స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని గురువారం మండల ఏఓ సునీల్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేసి మాట్లాడారు. ఎరువుల నిల్వలు, అమ్మకాలు రికార్డులలో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. అదేవిధంగా రైతులకు భవిష్యత్‌లో అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, ఆర్‌బీకే ఇన్‌చార్జి విక్టోరియా రాణి, ఆర్‌బీకే వలంటీర్‌ అశోక్‌, రైతులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ శుక్రవారం కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర వెల్లడించారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు అవుతున్న రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం కేవలం కార్పొరేట్‌ సంస్థలకు మేలు చేయడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ సమస్యలపై చేస్తున్న నిరసనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి

చక్రాయపేట : మామిడి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి తెలిపారు. గురువారం మండలంలోని సురభి గ్రామం టుకూరు వాండ్లపల్లె వద్ద మామిడి రైతులకు మార్కెటింగ్‌, సస్యరక్షణ చర్యలు, బిందు సేద్యంపై ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మామిడి రైతులు సరైన అవగాహన లేక పోవడంతో తమ పంట దిగుబడిని దళారులను నమ్మి మోసపోతున్నారన్నారు. దీంతో దిగుబడి వచ్చినా నష్టాల పాలు కావాల్సిన పరిస్థితి రైతులకు కలుగుతోందన్నారు. ఇందుకోసం రైతులు కలసికట్టుగా ఎఫ్‌పీఓలుగా ఏర్పడాలన్నారు. రైతులకు కలెక్షన్‌ సెంటర్‌ యొక్క సబ్సిడీల వివరాలను వివరించారు. మామిడిలో ప్రస్తుతం పూత పిందె వివిధ దశల్లో ఉన్నందున ఈ సమయంలో పిచికారి చేయాల్సిన మందులను మామిడి శాస్త్ర వేత్త సునీల్‌ వివరించారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన మామిడి ఉత్పత్తి దారుల ప్రతినిధులు, మామిడి గుజ్జు పరిశ్రమ ప్రతినిధులతో పాటు ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు శివ ప్రసాదరెడ్డి, సింగిల్‌ విండో అధ్యక్షుడు సురేష్‌రెడ్డి ఉద్యాన శాఖ అధికారి రెడ్డెయ్య, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, మండలంలోని ఉద్యాన, వ్యవసాయశాఖల సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలి

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2021-22లో జరిగిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలని ఎస్‌ఆర్‌పీ తిరుమలేష్‌ తెలిపారు. గురువారం మండలంలోని వల్లూరు, గోటూరు, కోట్లూరు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై చేపట్టిన 16వ విడత సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలన్నారు. మండలంలో రూ.4.08 కోట్లు మేరకు కూలీలకు, రూ.3.54 మేరకు మెటీరియల్‌కు ఖర్చు చేసి ఉన్నారని, ఆ పనులన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడైనా అవినీతి జరిగి ఉంటే నివేదిక సిద్ధం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈనెల 22వ తేదీ నాటికి సామాజిక తనిఖీ పూర్తి చేయాలన్నారు. 23న జిల్లా అధికారుల సమక్షంలో ఓపెన్‌ ఫోరం జరుగుతుందన్నారు. 11న తోళ్లగంగన్నపల్లె, 12న పైడికాలువ లేబాక, 13న దిగువపల్లె, 14న దుగ్గాయపల్లె, 15న తప్పెట్ల, 17న అంబవరం, 18న కొప్పోలు, పెద్దపుత్త, 19న కుమారునిపల్లె, 20న ఆదినిమ్మాయపల్లె గ్రామాల్లో సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. ఉపాధి కూలీలు, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు సామాజిక తనిఖీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్‌ మెడికల్‌ సెంటర్‌(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్‌ వి.ప్రతాప్‌రెడ్డి వస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్‌, ముక్కులో రక్తం కారుట వంటి వాటికి చికిత్సలుంటాయన్నారు. ఎండోస్కోపి, సైనస్‌ సర్జరీ, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌తో మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్‌ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజీల్‌ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్‌ బాండిన చేస్తామన్నారు.

ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568286189, 9963170177 అనే ఫోన్‌ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అర్బన్‌ సీఐ రాజు

పులివెందుల : సైబర్‌ నేరాలపట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని అర్బన్‌ సీఐ రాజు తెలిపారు. గురువారం పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు సైబర్‌ నేరాల గురించి ఆయన అవగాహన కల్పించారు. అలాగే దిశా యాప్‌ ఎమర్జెన్సీ నెంబర్స్‌, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నివారణా చర్యలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్‌ దాడులకు గురవుతున్న నేపథ్యంలో ఇంటర్నెట్‌ వినియోగిస్తున్న ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఆన్‌లైన్‌ మోసాలు, లక్కీడ్రా మోసాలు, క్లిక్‌ చేయాలంటూ వచ్చే మెసేజ్‌లను నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చంద్రశేఖర స్వామి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్‌ ప్రింటర్‌ వితరణ

చింతకొమ్మదిన్నె : మండల పరిధి అంగడివీధిలోని పాఠశాలకు గురువారం మండలంలోని చిన్నముసల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన చేనేత ఐక్య వేదిక కోశాధికారి గునిశెట్టి సాయికుమార్‌ కంప్యూటర్‌ ప్రింటర్‌ను వితరణ చేసినట్లు మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి తెలిపారు.

వినూత్న ఆలోచనలకు చక్కటి అవకాశం

వైవీయూ : ప్రస్తుత 21వ శతాబ్దం వినూత్న ఆలోచనలు కలిగిన మేధావులు, యువతకు చక్కటి అవకాశాల వేదిక అని కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వి.ఎస్‌.ఎస్‌.మూర్తి తెలిపారు. గురువారం కళాశాలలో ఈసీఈ, ఐయూసీఈఈ స్టూడెంట్స్‌ చాప్టర్‌ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రొలిఫిక్‌ 2కె23 ప్రాజెక్ట్‌ ఎక్స్‌ పో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్‌ జి. హేమలత, శ్రీహరి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీరంగనాథుడు

నేడు కల్యాణం



గరుడ వాహనంపై సతీసమేత శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్‌ : పట్టణంలోని పూలంగళ్ల వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో జరుగుతున్న శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు సతీసమేతుడై గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మండపంలో స్వామివారికి అర్చకులు కృష్ణరాజేష్‌ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పర్యవేక్షించారు. సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై ఉన్న శ్రీరంగనాథస్వామికి బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్‌, సంఘ సభ్యులు ఊరేగింపుగా వచ్చి పూలమాలలను సమర్పించారు. అనంతరం పట్టణ పురవీధులలో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని మెయిన్‌ బజార్‌, ముత్యాలవారి వీధి, గాడిచర్లవీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా ఊరేగారు. ప్రత్యేక అలంకారంలో ముగ్ధమోహన రూపుడైన స్వామివారు తమ ఇంటి ముందుకు రాగానే భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం (నేడు) శ్రీరంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ సూచనల మేరకు బలపరిచిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్‌ మూలె సుధీర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు సూచించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల గురించి పట్టభద్రుల ఓటర్లకు తెలిపి ఎమ్మెల్సీల గెలుపునకు కృషిచేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్‌ డైరెక్టర్‌ లోగిడి జయన్న, మున్సిపల్‌ కో.ఆప్షన్‌ సభ్యులు గజ్జల లక్ష్మయ్య, ఫయాజ్‌ బాషా, ఇండస్ట్రియల్‌ డెవలప్‌మెంట్‌ డైరెక్టర్‌ మార్బుల్‌ శ్రీను, బి.సి. సంఘం నాయకుడు బడిగించల చంద్రమౌళి, హృషికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి రైతుకు డ్రిప్‌ పరికరాలు



సూక్ష్మ సేద్య పరికరాన్ని పరిశీలిస్తున్న పీడీ రవీంద్రనాథరెడ్డి, తదితరులు

లింగాల : అర్హత కలిగిన ప్రతి రైతుకు డ్రిప్‌ పరికరాలు అందిస్తామని సూక్ష్మ నీటి సాగు పథకం పీడీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని బోనాల గ్రామంలో బిందు సేద్య పరికరాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 8 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా.. అందులో 6117 హెక్టార్లకు పరిపాలనా అనుమతులు పొందడం జరిగిందన్నారు. అవసరమైన ప్రతి రైతుకు సూక్ష్మ సేద్య పరికరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. డ్రిప్‌ పరికరాలు తీసుకుని ఏడేళ్లు దాటిన రైతులు అర్హులన్నారు. అర్హులైన ప్రతి రైతు డ్రిప్‌ పరికరాల కోసం తమ పరిధిలోని ఆర్‌బీకేలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులు కంపెనీ ప్రతినిధులతో పొలాల్లో ప్రాథమిక సర్వే చేయించుకుని సూక్ష్మ సేద్య పరికరాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

12న అంబకపల్లె ఆవులస్వామి ఆరాధన



అంబకపల్లెలోని ఆవులస్వామి ఆలయం



అవధూత శ్రీఆవులస్వామి జీవ సమాధి



వేపచెట్టుకు భక్తులు కట్టిన ముడుపులు

లింగాల : మండలంలోని అంబకపల్లె గ్రామంలో వెలసిన అవధూత ఆవులస్వామి ఆరాధన ఉత్సవాలను ఈనెల 12వ తేదీన ఆదివారం నిర్వహించడానికి ఆలయ ధర్మకర్త తేజేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి ఏడాది మహాశివరాత్రికి ముందు వచ్చే ఆదివారం ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దళిత వంశీకులైన మారెమ్మ, మారెప్పల కుమారుడు ఆవులస్వామి. ఆయనను చిన్నప్పుడు దొడ్డోడు అనేవారు. ఆయన యుక్త వయస్సు వచ్చే వరకు దిగంబరిగా తిరిగేవాడని గ్రామ పెద్దలు తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు దండించడంతో నల్లని కంబలి కప్పుకుని తిరిగేవాడని, రైతుల ఆవులను కొండకు మేపుకునేందుకు వెళ్లి సమీపంలోని నూతి కోన వద్ద ఉన్న గుహలో తపస్సు చేసుకునేవాడన్నారు. గ్రామంలోని ప్రజలకు భూత, భవిష్యత్‌, వర్తమాన కాలాల గురించి వివరిస్తూ గాలి, గ్రహాలతో బాధపడుతున్న వారికి తన శక్తితో ఉపశమనం కలిగించేవాడన్నారు. ఆయన వివాహం చేసుకోలేదన్నారు. తనను జీవ సమాధి చేయాలని గ్రామ పెద్దలను కోరడంతో.. ఆయనను జీవ సమాధి చేశారు. ఆ సమయంలో నాకు ఆలయాన్ని నిర్మించి ప్రతివారం పూజలు నిర్వహించాలని కోరారన్నారు. పాము కాటుకు గురైన వారు, గాలి గ్రహాలతో బాధపడుతున్న వారు మూడు ఆదివారాలు నా సన్నిధిలో సేద తీరితే వారికి ఉపశమనం లభిస్తుందని చెప్పారన్నారు.

దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయం

ఆవులస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ఆవులస్వామి జీవ సమాధి చుట్టూ చిన్నపాటి గుడి ఉండేది. ప్రస్తుతం పెద్ద ఆలయం నిర్మించబడింది. భక్తులు సేద తీరేందుకు పెద్ద, పెద్ద వరండాలు వెలిశాయి. ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది.